క్లుప్తంగా

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

వెంకటగిరి రూరల్ : గర్భిణులు తప్పని సరిగా పోషకాహారం తీసుకోవాలని సీడీపీవో శంషాద్ బేగం తెలిపారు. మండలంలోని సోమసానిగుంట, పూజారివీధి అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా గుడ్లు, పాలు, ఆకు కూరలు ఎక్కువగా తినాలన్నారు. బాలింతలు పిల్లలకు రెండేళ్లు వచ్చే వరకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కల్పలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శనివారం ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో యాక్షియాన్-2025 సాంకేతిక సదస్సు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి బహుమతి ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి సాంకేతిక సదస్సుల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ హరినాథ్‌రెడ్డి, కోఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



విద్యార్థిని ఇందుప్రియను అభినందిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కోట: వాల్ మార్ట్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సీఎస్ఈ మూడో ఏడాది చదువుతున్న కె.ఇందుప్రియ వార్షిక వేతనం రూ.27లక్షలతో ఉద్యోగానికి ఎంపికైంది. ఆమెను శనివారం కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషంధర్ పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

వాకాడు : బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం దళితులకు న్యాయం జరగాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ రిటైర్డ్ కమిషనర్ ఉయ్యాల రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఇరిగేషన్ శాఖ అతిథి గృహంలో శనివారం సమాజ చైతన్య సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాకాడులో ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు భాగస్వాములు కావాలన్నారు. రానున్న రోజుల్లో మాలలంతా ఐక్యంగా మన సత్తా ఏమిటో చూపించాలని పిలుపునిచ్చారు. సమాజ చైతన్య సమితి సభ్యులు రంగనాథ్, కృష్ణయ్య, ఎన్.బాలాజీ, జయకుమార్, కోటయ్య, కేశవులు, పోలయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 46.977 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 46.977 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,380, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

దాతల సహకారంతో భక్తులకు వసతులు



స్నానపు గదులను ప్రారంభిస్తున్న శ్రీనివాసులు

చిల్లకూరు : దాతల సహకారంతో ఆలయాల్లో భక్తులకు వసతులు కల్పిస్తున్నట్టు గూడూరు ఏఎంసీ మాజీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి తెలిపారు. కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.7 లక్షలతో నిర్మించిన స్నానపు గదులు, మరుగుదొడ్లను శనివారం ట్రస్టు అధినేత శ్రీనివాసులు ప్రారంభించారు. జానకిరామిరెడ్డి మాట్లాడుతూ పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు పలువురు దాతలు ముందుకు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి రామానాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, నెలటూరు చిరంజీవి, ఉడతాశ్రీనివాసులు, ప్రజేంద్రరెడ్డి, బాబు, నెల్లూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముక్కంటీశుని ఆలయంలో రద్దీ

శ్రీకాళహస్తి : వరుస సెలవుల కారణంగా శనివారంశ్రీకాళహస్తీశ్వరాలయం భక్త జన సంద్రంగా మారింది. పెద్ద ఎత్తున రాహు, కేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. తాగునీరు అందుబాటులో లేకపోవడంతో భక్తులు ఇబ్బందిపడ్డారు. రాహు, కేతు పూజల్లో 5,188 మంది భక్తులు పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి ఆలయం మూతవేసే సమయానికి దాదాపు పాతిక వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారని అధికారులు తెలిపారు.

అసంపూర్తి నిర్మాణం

మన్నారుపోలూరులో అర్ధాంతరంగా ఆగిన అర్బన్ హెల్త్ క్లినిక్ భవనం





అర్బన్ హెల్త్ క్లినిక్ నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని మన్నారుపోలూరు జగనన్న కాలనీ సమీపంలో రూ.80 లక్షలతో అర్బన్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయాయి. పట్టణాల్లోని పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం అర్బన్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటుచేసింది. ఇందులో భాగంగానే మన్నారుపోలూరు అర్బన్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం 60 శాతం పైగా పూర్తి చేశారు. ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో కక్షపూరితంగా వ్యవహరించి నిర్మాణాన్ని ఆపేసింది. దీంతో పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి భవన నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

దక్కిలి : మండలంలోని వీకేపై సముద్రం గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డులో వెళ్లాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వీకేపై గ్రామంలో సుమారు 150 ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామానికి వెంకటగిరి-రాపూరు జాతీయ రహదారిలోని వెల్లికల్లు నుంచి సుమారు 4 కిలోమీటర్లు రోడ్డు ఉంది. గతంలో పంచాయతీ రాజ్ శాఖ అధ్వర్యంలో రెండు కిలోమీటర్లు తారు రోడ్డు వేశారు. అటవీశాఖ అధికారుల అభ్యంతరాలు తెలపడంతో మిగిలిన రోడ్డు వేయలేదు. అప్పటి నుంచి అటవీశాఖ క్లియరెన్స్ ఇప్పించి తారు రోడ్డు వేయాలని స్థానికులు అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. వర్షాకాలం వస్తే రోడ్డులో ఉన్న గుంతల్లో నీరు నిలిచి నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, బాలింతలను ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు.



వర్షాకాలం వస్తే వీకేపై సముద్రం రోడ్డు దుస్థితి (ఫైల్)

ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నాం



తారు రోడ్డు వేయాలని ఎన్నో ఏళ్ల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం గుంతలు కూడా పూడ్చడం లేదు. వర్షాకాలం వస్తే రోడ్డు బురదమయంగా మారుతుంది. దీంతో గ్రామానికి ఆటోలు, బైక్‌లు కూడా నడిచే అవకాశం ఉండడం లేదు. అధికారులు స్పందించి అటవీ అనుమతులు ఇప్పించి మా గ్రామానికి తారు రోడ్డు వేయించాలి.

– డీపీ యాదవ్, వీకేపై సర్పంచ్

ఇంటర్‌లో సత్తాచాటిన గురుకుల విద్యార్థులు





కోట : మోహన్‌బాబు, మధు

కోట : ఇంటర్ ఫలితాల్లో కోట బీసీ గురుకుల కళాశాలలో ఇంటర్ సెకండియర్‌లో 117 మందికి 117 మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ నారాయణరావు తెలిపారు. ఎంపీసీ విద్యార్థి మోహన్ బాబు 982 మార్కులు, బైపీసీలో మధు 970 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఎస్సీ గురుకుల కళాశాలలో సీనియర్ ఇంటర్‌లో వందశాతం, జూనియర్ ఇంటర్‌లో 62 మందికి 60 మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి క్రాంతి 975 మార్కులు సాధించినట్లు తెలిపారు. చిట్టేడు ఎస్టీ గురుకుల కళాశాలలో సీనియర్ ఇంటర్‌లో వందశాతం, జూనియర్ ఇంటర్‌లో 71 మందికి 65 మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ శేషవర్ధన్ తెలిపారు.

దొరవారిసత్రంలో..



నాగవినయ్, లోకేష్, దీక్షిత్, మనోజ్



లహరి, గాయత్రి, దేవసేన, బొమ్మయ్య

దొరవారిసత్రం : దొరవారిసత్రంలోని బీసీ గురుకుల కళాశాల, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు సీనియర్ ఇంటర్‌లో వంద శాతం, జూనియర్ ఇంటర్‌లో 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాళ్లు తిరుపతయ్య, పార్వతి తెలిపారు. ఇంటర్ సెకండ్ ఇయర్ ఎంపీసీలో నాగవినయ్ 982, బైపీసీలో లోకేష్ 978, సీఈసీలో ఉమామహేష్ 933 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో దీక్షిత్, మనోజ్ 463, బైపీసీలో 434, ఎంఈసీలో రూపేష్ 479, సీఈసీలో ఫజుల్లా 414 సాధించారు. కేజీబీవీలో సీనియర్ ఇంటర్‌లో వంద శాతం, జూనియర్ ఇంటర్‌లో 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్‌లో లహరి 969 మార్కులు సాధించింది. జూనియర్ ఇంటర్‌లో గాయత్రి 480 మార్కులు సాధించింది. మావిళ్లపాడులోని ఆదర్శ పాఠశాలలో సీనియర్ ఇంటర్‌లో 90 శాతం, జూనియర్ ఇంటర్‌లో 67 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సుమలత తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో దేవసేన 843, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో బొమ్మయ్య 438 మార్కులు సాధించారు.

ఏపీమోడల్, కళాశాలలో..





దవనిక, మునికుమార్

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మోడల్ స్కూల్ అండ్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో 82 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తులసిజ్యోతి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో కె.మునికుమార్ 464, సీఈసీలో వై.శిరీష 432 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎస్.దవనిక 969 మార్కులు, బైపీసీలో దామిని పద్మావతి 961 మార్కులు సాధించినట్లు తెలిపారు. విశ్వోదయ జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో 115 మందికి గాను 59 మంది, సీనియర్ ఇంటర్‌లో 105 మందికి గాను 70 మంది ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు.

రాపూరులో..



రాపూరు- సతీష్, కల్పన, సమీర



రాపూరు - మేరి, హజీరా, అనిత

రాపూరు: రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్‌లో 65 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకట్ నాయక్ తెలిపారు. ఎంపీసీలో సతీష్ 883, బైపీసీలో కల్పన 708, సీఈసీలో అఖిల 838, ఎంఎల్‌టీలో సమీర 793, ఓఎస్ఏలో దేవయాని 797 మార్కులు సాధించినట్లు తెలిపారు. కండలేరు గురుకుల పాఠశాలలో సీనియర్ ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపాల్ భారతి తెలిపారు. ఎంఈసీలో మేరి 914, హజీరా 887, అనిత 868 మార్కులు సాధించినట్టు తెలిపారు. అలాగే జూనియర్ ఇంటర్‌లో 75 మందికి గాను 69 మంది ఉత్తీర్ణులైనట్లు ఆమె వివరించారు.

చిట్టమూరులో..



నితీష్ రాజ్

చిట్టమూరు : మండలంలోని మల్లాంలోని సీవీఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థి నితీష్‌రాజ్ సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 983 మార్కులు సాధించినట్టు ఎంఈవో-2 ప్రసాద్ తెలిపారు. అలాగే అరవపాళెం హైస్కూల్ ప్లస్‌లో సీనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో వంద శాతం ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 71.4 శాతం ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో అనూష 763 మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు.

నాయుడుపేటలో..



బి.నితేష్, ఎ.నవీన్ కుమార్, ఎస్.వంశీ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట అంబేడ్కర్ బాలుర గురుకులంలో సీనియర్ ఇంటర్‌లో 88.89 శాతం, జూనియర్ ఇంటర్‌లో 78 శాతం మంది పిల్లలు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ దాదాఫీర్ తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో బి.నితీష్ 953, ఎ.నవీన్ కుమార్ 953, బైపీసీలో ఎస్.వంశీ 943, ఎన్.కుమార్ 937, కె.సంతోష్ 824 మార్కులు సాధించినట్టు తెలిపారు. పుదూరు బాలికల గురుకులంలో సీనియర్ ఇంటర్‌లో 99 శాతం, జూనియర్ ఇంటర్‌లో 85 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ రూత్ రోమోలా తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో బి.నందిని 934, బైపీసీలో బి.షకీలా 963 మార్కులు సాధించినట్టు తెలిపారు.

బాలాయపల్లిలో ..





గాయత్రి, శోభారాణి

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ బైపీసీలో ఎం.గాయత్రి 952, సీఈసీలో ఎం.శోభారాణి 933 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ జేఎస్ రాంగోపాల్ తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 25 మందికి గాను 14 మంది ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

శ్రీవేమ, విక్రమ్ విద్యార్థుల ప్రతిభ

నాయుడుపేట టౌన్ : ఇంటర్ ఫలితాల్లో నాయుడుపేట పట్టణంలోని శ్రీవేమ, విక్రమ్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని ఆయా కళాశాలల ప్రతినిధులు తెలిపారు. శ్రీవేమ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎం.జశ్వంత్, కె.శ్రావణ్ కుమార్ రెడ్డి 982, కే సాయి హాసిని 981, కె.తనిష్క 980, బైపీసీలో కె.నందిత చౌదరి 961, పి.తేజ చరణ్ 931 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఎంపీసీలో వి.శ్రీహర్షిణి 465, వి.నేహాశ్రీ 465, వి.శ్రీహాసిని 463 మార్కులు సాధించినట్టు వెల్లడించారు. విద్యార్థులను ఆయన అభినందించారు. అలాగే విక్రమ్ కళాశాల కరస్పాండెంట్ జలదంకి విజయబాబురెడ్డి, డైరెక్టర్లు కామిరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎం.హెమంత్ కుమార్ 988, బైపీసీలో ఎం.దిలీప్‌రెడ్డి 967, ఎంఈసీలో షేక్ హఫీజ్ 972, ఎస్.ప్రశాంతి 962, పి.మునిశిరీష 958, పి.మనీషా 952, ఎం.బాలాజీ 950, ఎం.కరిష్మా 949, షేక్ షమీర్ 923 మార్కులు సాధించినట్ట వివరించారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీవేమ కరస్పాండెంట్ శ్రీనివాసులు రెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న విక్రమ్ కరస్పాండెంట్ జలదంకి విజయబాబు రెడ్డి

స్వర్ణాంధ్ర భారతి విద్యార్థుల హవా



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు

చిల్లకూరు : ఇంటర్ ఫలితాల్లో గూడూరులోని స్వర్ణాంధ్రభారతి జూనియర్ కళాశాల విద్యార్థులు చత్తా చాటినట్టు యాజమాన్యం తెలిపింది. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో జి.చరణ్ 986, ఎస్‌కే అమాస్‌బేగం 984, చందు 977, బైపీసీలో ఈ.చార్లెస్ 925 మార్కులు సాధించినట్టు తెలిపారు. సీఈసీలో జి.సాయిదేవహర్షిణి 926, ఎం.ఇందు 908 మార్కులు సాధించినట్టు వెల్లడించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో సుధాపవన్య 450, డి.సుస్వర 447 మార్కులు సాధించినట్టు తెలిపారు. వారిని అధ్యాపకులు అభినందించారు.

బాలికకు రూ.73 వేల సాయం



బాలికకు చెక్కు అందజేస్తున్న నేదురుమల్లి హరీష్‌చంద్రారెడ్డి

కోట: మండలంలోని కొత్తపాళెం గ్రామానికి చెందిన బాలిక షేక్ ఆఫ్రిన్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. వైద్య చికిత్సల కోసం కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు నేదురుమల్లి హరీష్‌చంద్రారెడ్డి శనివారం రూ.73 వేలు సాయం అందించారు. ఆయనకు బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఆఫ్రిన్ వైద్య చికిత్సకు ప్రభుత్వం సాయం అందించాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



పూర్ణాహుతి చేస్తున్న ఉభయదారులు

చిల్లకూరు : ముత్యాలమ్మ ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. గూడూరు పట్టణంలోని మైథిలి హాస్పిటల్ యజమానులు డాక్టర్ మైథిలి, రమణ బాబు దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అమ్మవారికి 18 కలశాలను ఏర్పాటు చేసి హోమంలో పాల్గొన్న మహిళలకు జాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నవీన్‌కుమార్, అర్చకులు శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ప్లేట్లు, పాదరక్షల పంపిణీ



చిన్నారులకు పేట్లు, గ్లాసులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

వాకాడు : మండలంలోని నిడిగుర్తి గ్రామంలోని అంగనవాడీ కేంద్రంలో వున్న పేద పిల్లలకు శనివారం దళిత సాహిత్య అకాడమీ ప్రతినిధులు పాదరక్షకులు, భోజన పేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ జ్యోతిరావుపూలే జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. అలాగే టెన్త్ విద్యార్థులకు శంకరనారాయణ డిక్షనరీలు అందజేశారు. సంస్థ సభ్యులు వల్లీప్రసాద్, వాకాటి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.2.97 లక్షల విరాళం





విరాళం అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులు, నగదు అందజేస్తున్న నవీన్‌కుమార్‌రెడ్డి

రాపూరు: పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తిరుపతికి చెందిన వాసిలి పెంచల ప్రవీణ్, శిరీష దంపతులు రూ.1,11,116, రాపూరు మండలం గోనుపల్లికి చెందిన గార్లపాటి కృష్ణప్రసాద్ జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని సుప్రియ రూ.1,11,116, అనంతసాగరం మండలం మంచాలపల్లికి చెందిన సజ్జా నవీన్‌కుమార్‌రెడ్డి ధర్మపత్ని దివ్య రూ.75,116 విరాళంగా అందజేసినట్టు ఆలయ ఏసీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వారికి మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నలుగురిపై కేసు నమోదు

దక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లిలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గాల మధ్య చోటుచేసుకున్న వివాదంలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన కోళ్లూరు బాలకృష్ణకు అదే గ్రామానికి చెందిన వేముల ఈశ్వరయ్య నగదు ఇవ్వాల్సి ఉంది. బాలకృష్ణ డబ్బులు ఇవ్వాలని అడగడంతో మాటామాటా పెరిగి శనివారం పరస్పరం దాడులు చేసుకున్నారు. గాయపడిన వారిని కుటుంబ సభ్యులు వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలకృష్ణ ఫిర్యాదు మేరకు వేముల ఈశ్వరయ్య, శ్రీహరి, గోపాల్ పైన, ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు బాలకృష్ణపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

బ్రిడ్జిపై ఇరుక్కున్న టిప్పర్



అవస్థలు పడుతున్న విద్యార్థులు



టిప్పరును బయటకు తీస్తున్న సిబ్బంది

కలువాయి(సైదాపురం): మండలంలోని కొలవపల్లి గ్రామం సమీపంలోని బ్రిడ్జి వద్ద శనివారం భారీ ట్రిప్పర్ ఇరుక్కుపోయింది. దీంతో తెలుగురాయపురం -కలువాయి మధ్య రాకపోకలు స్తంభించాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మైనింగ్ అధికారులు అక్కడికి చేరుకుని ట్రిప్పర్ సీజ్ అంటూ ఒక ఫొటో తీసుకుని వెళ్లిపోయారు. తెలుగురాయపురంలో కూటమి నేతలు ఇసుక అక్రమ రవాణాను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారని, భారీ టిప్పర్లు పెద్ద సంఖ్యలో తిరుగుతుండడంతో రోడ్డు తింటోందని స్థానికులు చెబుతున్నారు.

పంచాయతీ కార్యదర్శిపై గ్రామస్తుల ఆగ్రహం





గ్రామంలో వెలగని వీధిలైట్లు, పైపులైను దెబ్బతినడంతో జెడ్పీ హైస్కూల్ ముందు నిలిచిన నీరు

చిట్టమూరు : మండలంలోని ఆరూరు గ్రామంలో వీధిలైట్లు వెలగడం లేదని, తాగునీటి పైపులైన్లు పగిలి లీకై నీరు కలుషితమవుతుండడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి శనివారం ఆరూరు గ్రామంలో ఇంటి పన్నులు వసూలు చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలో గ్రామస్తులు కార్యదర్శిని నిలదీశారు. వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయడం లేదని, తాగునీటి లీకేజీ గురించి పట్టించుకోనప్పుడు ఇంటి పన్నులు ఎందుకు కట్టాలని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించి పన్నులు వసూలు చేయాలన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



రాపూరులో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: స్థానిక శ్రీరామ మందిరంలో శనివారం రాత్రి సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను వేదికపై కొలువుదీర్చారు. విశేషంగా అలంకరించి కల్యాణం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉభయదారులుగా ఏటూరి పుల్లారెడ్డి, వాణి వ్యవహరించారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి (సైదాపురం) : పట్టణంలోని వెలమపాళెంలోని ద్రౌపది, ధర్మరాజులు, సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా 7వ రోజు కల్యాణం చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు.